ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కుమరం భీం జిల్లా వార్తలు

బుధవారం 23 అక్టోబరు 2024



బిల్లులు రాక.. అప్పులు తీరక..

జిల్లాలో వివిధ పథకాల కింద అభివృద్ధి పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు బిల్లులు మంజూరు కాక ఆందోళన చెందుతున్నారు. తాము ప్రభుత్వం సకాలంలో మంజూరు చేస్తుందనే ఆశతో అప్పులు తెచ్చి పనులు పూర్తి చేశామని, ఏళ్ల తరబడి రాకపోవడంతో అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు. జిల్లాలో రూ. కోట్లకు పైగా బిల్లులు రావల్సి ఉంది.

- చేసిన పనులకు డబ్బులు అందక కాంట్రాక్టర్ల ఆందోళన
- ఉన్నతాధికారులకు నివేదించామని అధికారుల వెల్లడి
- జిల్లాలో రూ. 60 కోట్లకు పైగా పెండింగ్

ఆసిఫాబాద్ రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో చేపట్టిన అభివృ ద్ధి పనులు బిల్లులు రాక కాంట్రాక్టర్లు ఆందోళన చెందుతున్నారు. అప్పులు తెచ్చి పనులు చేసిన కాంట్రాక్టర్లు ఏళ్ల తరబడి బిల్లుల కోసం వెంపర్లడు తున్నారు. ఒక నెలో రెండు నెలలో కాదు ఎకంగా రేండేళ్ల బిల్లులు చేతికందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. కుమరంభీం ఆసిఫాబా ద్ జిల్లాలో పలు నిధుల కింద చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు రాకపోవడంతో సంబంధిత కాంట్రాక్టర్లు ఆవేదన చెందుతున్నారు. పనులు చేపట్టి ఏళ్లు గడుస్తున్నా బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు మనోవేదనకు గురవుతున్నారు. ఉన్నతాధికారులకు చెప్పినా ఫలితం లేక పోవడంతో దిక్కుతోచని పరిస్థితి నెలకొందని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో తాము తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని వాపోతున్నారు.

● అధికారుల చుట్టూ ప్రదక్షిణలు..

జిల్లాలో గుత్తేదార్లు చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో కార్యాల యాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పనులు పూర్తయి ఏళ్లు గడుస్తున్నా నిర్మాణ పనులకు సంబంధించిన బిల్లులు రాకపోవ డంతో ప్రతి రోజు అయా కార్యాలయాలకు వెళ్లి తమ బిల్లుల పరిస్థితి ఏంటని అధికారులను ఆరా తీస్తున్నారు. కొంత మంది కాంట్రాక్టర్లు బిల్లుల మంజూరీ కోసం హైదరాబాద్‌లోని సెక్రటేరియేట్‌లో సైం పైరవీలు సైతం చేసుకొవాల్సిన పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. జిల్లాలో పేరుకు పోయిన బిల్లులతో కొత్తగా అభివృద్ధి పనులు చేసేందుకు ఎవరు ముందుకు రావడంలేదు. పాత బిల్లులే కోట్లలో పెండింగ్‌లో ఉండడంతో కొత్త పనులు చేసేందుకు ఎవరు మొగ్గు చూపడం లేదు. పనుల కోసం అప్పులు చేసిన కాంట్రాక్టర్ల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. నిర్మాణ యంత్ర సామగ్రి, వాహనాల కిస్తీలు కూడా చెల్లించలేని పరిస్థితి నెలకొంది.

● వివిధ రకాల పనుల కోసం..

జిల్లాలో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో కంట్రాక్టర్లకు పేమెంట్లు అందక తీవ్ర అవస్థలు పడుతున్నారు. జిల్లాలో సుమారుగా రూ. 60కోట్లకు పైగా పెండింగ్ బిల్లులు ఏళ్లు గడుస్తున్న రాకపోవడంతో కాంట్రాక్టర్లు పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. నిర్మాణ సమయంలో వడ్డీకి తీసుకువచ్చి పనులు చేపట్టగా బిల్లులు సకాలంలో రాకపోవడంతో కాంట్రాక్టర్లు అప్పుల ఊబీలో కురుకుపోతున్నారు. జిల్లాలో డీఎంఎఫ్‌టీ కింద 442 పనులు నిర్వహిం చగా అ పనులకు సంబంధించిన రూ. 15.25 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద 328 పనులు చేపట్టగా రూ. 12 కోట్ల బిల్లులు ఇంకా రావాల్సి ఉంది. అలాగే గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సుమారు రూ. 30 కోట్ల నిధులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. అదే విధంగా మన ఊరు- మన బడి కింద నిర్వహించిన పనులకు కూడ బిల్లులు రాకపోవడంతో పనులు చేపట్టిన సర్పంచులు, కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం..

- ప్రభాకర్‌రావు, ఈఈ పంచాయతీరాజ్



జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లుల విషయంలో ఉన్నతాధికారులకు నివేదించాం. జిల్లాలో డీఎంఎఫ్‌టీ, ఎస్‌డీ ఎఫ్ పనులకు సంబంధించిన బిల్లుల పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వం నుంచి బిల్లులు మంజూరైన వెంటనే చెల్లిస్తాం.

పనులు పకడ్బందీగా చేపట్టాలి

- ఎన్‌ఐడీసీ జిల్లా డైరెక్టర్ సెంట్రల్ ప్రభారి రజత్‌కుమార్



వీసీలో పాల్గొన్న అధికారులు

ఆసిఫాబాద్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నీతి ఆయోగ్ పథకం కింద జిల్లాలో చేపట్టిన ఆకాంక్షత కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న పనులను సమర్థవంతంగా నిర్వహించాలని ఎన్ఐడీసీ కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా డైరెక్టర్ సెంట్రల్ ప్రభారి రజత్‌కుమార్ అన్నారు. న్యూఢిల్లీ నుంచి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని నీతి ఆయోగ్ కింద కొనసాగుతున్న పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ సెంట్రల్ మా ట్లాడుతూ జిల్లాలో చేపట్టిన ఆకాంక్షత కార్యక్రమం సంబంధిత పనులను అధికారులు సమర్థవంతంగా నిర్వహించాలని చెప్పారు. సంబంధిత శాఖల సమన్వయంతో పనుల పురోగతిని పర్యవేక్షిస్తూ వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా కేంద్రం లోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీసీ హాల్ నుంచి అదనపు కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ ఆకాంక్షత కార్యక్రమంలో భాగంగా నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో 2018 నుంచి 6 అంశాలపై జిల్లాలో వివిధ కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ఆరోగ్యం, పోషకాలు, వ్యవసాయ సాగునీరు, నైపుణ్యాతాభివృద్ధి, ఆర్థిక సహకారం, విద్య, వైద్యం అంశాలపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని చెప్పారు. ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తున్నామని తెలిపారు. నీతి ఆయోగ్ ద్వారా మంజూరైన రూ.3 కోట్ల నిధులతో జిల్లాలో 279 అంగన్‌వాడీ భవనాలకు రంగులు, పిల్లలను ఆహ్లాదపరిచే విధంగా బొమ్మలు వేయించామని చెప్పారు. తాగునీరు, మూత్రశాలలు, న్యూట్రిగార్డెన్, విద్యుత్ సరఫరా, చిన్నారులకు ఆట వస్తువులు, పాఠశాల అభివృద్ధి పనులు, మినీ అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, పిల్లల సంక్షేమంలో భాగంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు, పౌష్టికాహారం అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి తుకారాం, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారాం, గ్రామీణాభివృద్ధి అధికారి రామకృష్ణ, విద్యా శాఖ అధికారి, లీడ్ డిస్టిక్ మేనేజర్ రాజేశ్వర్ జోషి పాల్గొన్నారు.

ఎస్‌ఏ-1 పరీక్షలను పరిశీలించిన ఏసీఎంవో

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని వావుదాం గ్రామ పంచాయతీలోని పార్వతిగూడ పాఠశాలలో నిర్వహి స్తున్న ఎస్‌ఏ-1 పరీక్షలను ఏసీఎంవో ఉద్ధవ్ మంగళవారం పరిశీలిం చారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులు, మధ్యాహ్న భోజనంను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలని చెప్పారు. రికార్డులను నమోదు చేయాలని, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.

ఉచిత కుట్టు మిషన్ శిక్షణ

రెబ్బెన, అక్టోబరు 22: రెబ్బెన ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో ఉచిత కుట్టుమిషన్ శిక్షణ ఇస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎంఎ జబ్బార్ ఉస్మాని తెలిపారు. శిక్షణ అనంతరం సెంట్రల్ గవర్నమెంటు నుంచి సర్టిఫికెట్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు 9030874318 నంబరులో సంప్రదించాలని కోరారు.

కరపత్రాల విడుదల

వాంకిడి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జేతవన్ బుద్ద విహార్‌లో ఈ నెల 25న నిర్వహించనున్న వర్షవాస్ ముగింపు కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను మంగళవారం అంబేద్కర్ యువజన సంఘం నాయకులు కార్యక్రమంలో జైరాం, సునీల్‌కుమార్, అశోక్, హంసరాజ్, విలాస్, ప్రశాంత్, శివాజీ, విఠల్, రాకేష్, చంద్రమణి, తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన ఎంఈవోకు సన్మానం

లింగాపూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎమార్సీ కార్యాలయంలో మంగళవారం పదవీ విరమణ పొందిన మండల విద్యాధి కారి కుడ్మెత సుధాకర్‌ను సన్మానించారు. మండల విద్యాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ సుధాకర్ సేవలు అభినందనీయమని కొనియాడారు.

శతాధిక వృద్ధురాలు మృతి

జైనూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లేండిగూడకు చెందిన శతాధిక వృద్ధురాలు ఆత్రం అన్నిబాయి (110) అనే కొలాం ఆదివాసీ మహిళ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందింది. అన్నిబాయి దండారి ఉత్సవాల్లో ఆదివాసీ కొలాం తెగల సంస్కృతి సాంప్ర దాయాలను నేర్పించారని పలువురు కొనియాడారు.

రేపు రక్తదాన శిబిరం

ఆసిఫాబాద్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లా కేంద్రంలోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ డీవీ శ్రీనివాస్ తెలిపారు. ఈ శిబిరంలో పెద్ద సంఖ్యలో అన్ని వర్గాల ప్రజలు, ఉద్యోగులు అందరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న వారికి, అత్యవసర శస్త్ర చికిత్సలలో రక్తం అవసరమైన వారికి సహాయ పడి వారి జీవితాలను నిలబెట్టిన వారవుతారని తెలిపారు.

అక్రమాలకు పాల్పడితే పీడీ యాక్ట్

ఆసిఫాబాద్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అక్రమ కార్యక్రమాలకు పాల్పడే వారిపై పీడీ యాక్టు నమోదుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్రమంగా పీడీఎస్ బియ్యం, రవాణా చేయడం, అక్రమంగా పశువుల రవాణా, అక్రమంగా ఇసుకను రవాణా చేయడం, గంజాయి, మట్కా, గుట్కా, గ్యాంబ్లింగ్ వంటి వాటికి పాల్పడే వారిని గుర్తించి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ సూచన మేరకు అక్రమార్కులపై కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు సమాచారం ఉంటే డయల్ 100 లేదా 8712670505కి కాల్ చేయాలని కోరారు.

స్వచ్ఛత కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి

రెబ్బెన, అక్టోబరు 22: స్వచ్ఛత కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని సింగరేణి ఏరియా జీఎం శ్రీనివాస్ తెలిపారు. మంగవారం స్వచ్ఛత పక్వాడ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి వ్యక్తి రోజులో గంట పాటు స్వచ్ఛత కార్యక్రమంలో పని చేయాలన్నారు. తద్వార చక్కటి పరిశుభ్రతమైన వాతావరణం ఉంటుందన్నారు. వ్యాధులు దరికి రావన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఓ టూ జీఎం రాజమల్లు, ఏరియా ఇంజనీర్ భీంరావు జాడే, డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్ కుమార్‌బెహర, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, పర్సనల్ మేనేజర్ ఆర్.తిరుపతి, సివిల్(ఎస్ఇ) మదీనా బాషా, ఎన్విరాన్మెంటు అధికారి రమేష్, అకౌంట్స్ అధికారి వెంకటేశ్వర్లు ఐటీ ఇన్‌చార్జీ ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపిక

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో పదో తరగతి చదువున్న ఎం సాక్షి ఈ నెల 25 నుంచి 28 వరకు ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో నిర్వహించే జాతీయ స్థాయి జూనియర్ అథ్లెటిక్ పోటీలకు ఎంపికైనట్లు గిరిజన క్రీడాధికారి మీనారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు జంగు తెలిపారు. ఈ సందర్భంగా శిక్షకుడు విద్యాసాగర్, విద్యార్థి సాక్షిని ట్రైబల్ వెల్ఫేర్ డీడీ రమాదేవి, ఏసీఎంఓ ఉద్ధవ్, ఏటీడీఓ చిరంజీవి, జీసీడీవో శకుంతల, ప్రధాన కార్య దర్శి కోట్నాక విజయ్, శంకర్, లక్ష్మణ్, శిక్షకులు అరవింద్, తిరుమల్, ఉపాధ్యాయులు అభినందించారు. పలువురు మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీల్లో రాణించి జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

నాటి గిరిజన వీరుల పోరాట పటిమ నేటి తరానికి ఆదర్శం

- అదనపు కలెక్టర్ దాసరి వేణు - రౌటసంకెపల్లిలో భీంకు ఘన నివాళి

ఆసిఫాబాద్ రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నాటి గిరిజన వీరుల పోరాట పటిమ నేటి తరానికి ఆదర్శ ప్రాయమన్ని అదనపు కలెక్టర్ దాసరి వేణు అన్నారు. కుమరం భీం పుట్టిన గ్రామమైన ఆసిఫాబాద్ మండలం రౌటసంకెపల్లిలో బుధవారం గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి రమాదేవి అధ్యక్షతన గిరిజన ఉత్సవాల పేరుతో నిర్వహించిన కుమరం భీం వర్ధంతి, భీం అనురుడు ఎడ్లకొండు వర్ధంతి సభను నిర్వహించారు. కార్యక్రమానికి ఏఎస్పీ ప్రభాకర్‌రావు, డీఎస్పీ కరుణాకర్, ఆర్డీఓ లోకేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, సింగిల్ విండో చైర్మన్ అలీబీన్ అహ్మద్, మాజీ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, మాజీ ఎంపీపీ మల్లికార్జున్, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బుర్స పోచయ్య, విజయ్‌లతో కలిసి అదనపు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా గిరిజన సంస్కృతి సంప్రదాయల ప్రకారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుమరం భీం, ఎడ్లకొండు విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ అనాటి గిరిజన వీరుల పోరాట పటిమ నేటి తరానికి ఆదర్శ ప్రాయమన్నారు. ఆదివాసీల సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. పీవీటీజీల అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు చేపట్టామని వివరించారు. భీం పుట్టిన రౌటసంకెపల్లి అభివృద్ధి కోసం నివేదికలు



కుమరం భీం, ఎడ్లకొండు విగ్రహాల వద్ద నివాళుల అర్పిస్తున్న నాయకులు

రూపొందించామని తెలిపారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాగానే చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు విజయ్, భీం వారసులు వెంకటేష్, రాము, సీతారాం, ఎడ్లకొండు వారసులు బక్కయ్య కొండు, మాజీ సర్పంచ్ కిష్టయ్య నాయకులు పాల్గొన్నారు.

బెజ్జూరు: మండల కేంద్రంలోని బస్టాండు ఏరియాలో మంగళవారం కుమరం భీం వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహాన్ని నీటితో శుద్ధి చేసి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ భీం ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ పాటుప డాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బక్కయ్య, సతీష్, వెంకటేష్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ఓవర్ లోడ్ లారీలపై చర్యలు తీసుకోవాలి



సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న లారీ అసోసియేషన్ సభ్యులు

కాగజ్‌నగర్, అక్టోబరు 22: ఎస్పీఎం మిల్లుకు నిత్యం వివిధ రాష్ట్రాల నుంచి ఓవర్ లోడ్ లారీలు వస్తున్నాయని, చర్యలు తీసుకోవాలని మంగళవారం సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాకు లారీ అసోసియేషన్ సభ్యులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లారీ అసోసియేషన్ అధ్యక్షుడు కిషోర్ బాబు మాట్లాడుతూ ఓవర్ లోడ్‌తో వస్తున్న లారీతో ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతోందో తెలియడం లేదన్నారు. వెంటనే విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్ డెయిరీ చైర్మన్‌ను కలిసిన ఎమ్మెల్యే

కాగజ్‌నగర్, అక్టోబరు 22: కరీంనగర్ డెయిరీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం చైర్మన్ సీహెచ్ రాజేశ్వరరావును మర్యాద పూర్వకంగా సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సిర్పూరు నియోజకవర్గంలో డెయిరీ సేవలను అందించాలని కోరారు.

అడవి పందుల దాడిలో పత్తి పంట ధ్వంసం

చింతలమానేపల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): చింతలమానేపల్లి శివారు ప్రాంతంలో రైతులు సాగు చేసిన రెండు ఎకరాల పత్తి పంటను సోమవారం రాత్రి అడవి పందులు ధ్వంసం చేశాయి. అడవి పందుల నుంచి పంట రక్షణ కోసం సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. చేటా చేతికొచ్చిన పంటను అడవి పందులు నాశనం చేస్తున్నా అధికారులు పట్టించు కోవడం లేదని, నష్ట పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

ఆత్మరక్షణకు కరాటే

- విద్యార్థినుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంచేందుకు శిక్షణ

- జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో అమలుకు చర్యలు

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 22(అంధ్యజ్యోతి): ప్రస్తుత సమాజంలో ప్రతి రోజూ ఏదో ఒక ప్రాంతంలో బాలికలు, విద్యార్థినులపై అఘాయిత్యాలు జరుగుతున్నాయి. ఇలాంటి తరుణంలో తల్లిదండ్రులు తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుల కోసం బయటకి పంపించాలంటే ఆందోళన చెందుతున్నారు. బాలికలకు చదువు ఒక్కటే సరిపోదని, వారు ఆపద సమయంలో తమను తాము రక్షించుకునేందుకు కరాటే లాంటి సెల్ఫ్ డిఫెన్స్ ఎంతో అవసరమని ప్రభుత్వం భావించింది. వీటిని నివారించాలని ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థినులకు కరాటే శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది.

● జిల్లాలో 1,634 పాఠశాలల్లో..

పాఠశాలలు నివాస ప్రాంతాల్లో కాకుండా దూరంగా ఉండడంతో అక్కడికి వెళ్లే గ్రామంలో చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాలను నివారించడానికి వ్యక్తిగత రక్షణ కోసం కరాటే శిక్షణ ఇవ్వడానికి ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో మొత్తం 1,634 వివిధ రకాల పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ప్రాథమిక పాఠశాలలు 908, ప్రాథమికోన్నత పాఠశాలలు 180, ఉన్నత పాఠశాలలు 170తో పాటు గిరిజన సంక్షేమ శాఖలో గిరిజన ప్రాథమిక పాఠశాలలు 330, ఆశ్రమ పాఠశాలలు 46 ఉన్నాయి. వీటన్నింటిలో అమలు చేయడానికి నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.

● ప్రభుత్వ నిర్ణయంతో..

బాలికలకు కరాటే నేర్పడానికి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో స్వీయరక్షణ అవకాశం ఏర్పడ నుంది. సెల్ఫ్ డిఫెన్స్ ఝాన్సీ లక్ష్మిబాయి స్కీం ద్వారా విద్యార్థినులకు మూడు నెలల పాటు కరాటే శిక్షణ ఇచ్చే విధంగా ప్రణాళిక రూపొందించారు. గత సంవత్సరం ఇదే పథకం ద్వారా కాగజ్‌నగర్ డివిజన్‌లోని చింతగూడ, పెట్రోల్‌పంపు, భట్టుపల్లి,



కరాటేలో శిక్షణ ఇస్తున్న మాస్టర్ (ఫైల్)

సర్‌సిల్క్ ఉర్దు మీడియం పాఠశాలల్లో, 12వ వార్డు పాఠశాలలో శిక్షణ ఇచ్చారు. ఈ ఏడాది జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థినులకు శిక్షణ ఇస్తున్నారు.

ఉత్తర్వులు వెలువడగానే..

ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో కరాటే శిక్షకులను నియమించుకోవాలని తెలిపింది. తుది ఉత్తర్వులు వెలువడిన వెంటనే ప్రతీ పాఠశాలలో కరాటే శిక్షకులను నియమించేందుకు చర్యలు తీసుకుంటు న్నారు. కరాటే శిక్షణ ద్వారా విద్యార్థినులకు స్వీయ రక్షణకు అవకాశం ఉంటుంది.

- ఉదయబాబు, ఎంఈవో, ఆసిఫాబాద్

జిల్లాలో సీఐల బదిలీలు

ఆసిఫాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సీఐల బదిలీలు చేపడుతూ హైదరాబాద్ మల్టీ జోన్-1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి మంగళవారం ఉత్తర్వులు వెలువరించారు. రామగుండం ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న పి రాజేంద్రప్రసాద్‌ను కాగజ్‌నగర్ టౌన్ సీఐగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో రూరల్ సీఐగా రాజేంద్ర ప్రసాద్ విధులు నిర్వహించారు. సీసీఆర్‌బీ రామగుండంలో పని చేస్తున్న బుద్దేస్వామి రెబ్బెన సీఐగా, హైదరాబాద్ ఇంటిలిజెన్స్ విభాగంలో సీఐగా పని చేస్తున్న బుద్దే రవీందర్‌ను ఆసిఫాబాద్ సీఐగా బదిలీ చేశారు. కాగజ్‌నగర్ టౌన్ సీఐగా విదులు నిర్వహిస్తున్న శంకరయ్య, ఆసిఫాబాద్ సీఐ సతీష్, రెబ్బెన సీఐ చిట్టిబాబులను హైదరాబాద్ మల్టీజోన్-1 ఐజీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన విద్యార్థినికి సన్మానం



సాయి శ్రద్ధను సన్మానిస్తున్న జైనూర్ పోలీసులు

జైనూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జండాగూడ గ్రామానికి చెందిన సాయి శ్రద్ధ ఇటీవల నీట్ పరీక్షలో 467 మార్కులు సాధించి ఎంబీబీఎస్‌లో సీటు సాధించడంతో మంగళవారం పలువురు అభినందించి సన్మానం చేశారు. ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేస్రాం మనోహర్ చేతుల మీదుగా జైనూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమేష్, ఎస్ఐ సాగర్, గ్రామస్థులు కలిసి 26 వేల రుపాయలు నగదు అందజేశారు. కార్యక్రమంలో ఆదివాసీ ప్రధాన ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆడ నగేష్, రాష్ట్ర కార్యదర్శులు మరప గోవింద్‌రావ్, ప్రధాన సంఘం సభ్యులు మడావి శ్రీనివాస్, కుంర సాయికృష్ణ, మేస్రాం శాంరావ్, సుందర్ పాల్గొన్నారు.

బస్టాండు లేక ప్రయాణికుల అవస్థలు



కెరమెరి మండల కేంద్రంలో బస్టాండు లేక పోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. బస్సుల కోసం చెట్ల నీడలో కూర్చుని వేచి చూస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- కెరమెరి

క్రైం కార్నర్

పత్తి చేనుకు నీరు పెట్టేందుకు వెళ్లి
విద్యుదాఘాతంతో యువకుడి మృతి


సతీష్ (ఫైల్)

కోటపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాపనపల్లిలో మంగళవారం పత్తి పంటకు నీరు పెట్టేందుకు వెళ్ళి బూర్తి సతీష్(25) అనే యువకుడు విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. సతీష్ తండ్రి రాజబాపు కౌలు రైతు. 2 ఎకరాల చేనును కౌలుకు తీసుకుని పత్తి సాగు చేశాడు. రాజబాపు కుమారుడైన సతీష్ వ్యవసాయ పనుల్లో తండ్రికి చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. మంగళవారం ఉదయం పత్తి పంటకు నీరు పెట్టేందుకు వెళ్లిన సతీష్ మోటారు స్టార్ట్ చేసి ఇనుప పైపును ముట్టుకున్నాడు. విద్యుత్ స్తంభం నుంచి మోటారుకు సరఫరా చేసే సర్వీసు వైర్ పైపార తెగిపోయి ఇనుప పైపునకు తాకి ఉంది. గమనించని సతీష్ పైపును ముట్టుకోవడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. చుట్టుపక్కల వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడి తండ్రి రాజబాపు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజేందర్ పేర్కొన్నారు. సతీష్ అవివాహితుడు.

విద్యుత్ తీగ మీద పడి వ్యక్తికి గాయాలు

హాజీపూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ముల్కల్ల గ్రామానికి చెందిన గోలివాడ చంద్రయ్యపై విద్యుత్ వైరు మీద పడడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. చంద్రయ్య మంగళవారం ముల్కల్లలోని గోదారి నదిలో చేపలు పట్టడానికి వెళ్లి పంప్ హౌజ్ దారి నుంచి తిరిగి వస్తుండగా పైన ఉన్న 33కేవీ విద్యుత్ లైన్ వైరు తెగి చంద్రయ్య మీద పడడంతో విద్యుత్ షాక్ తగిలి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అధికారులకు సమాచారం అందించగా విద్యుత్‌ను నిలిపివేశారు. అనంతరం చంద్రయ్యను మంచిర్యాలలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

గంజాయి అమ్ముతున్న ఇద్దరి అరెస్ట్

శ్రీరాంపూర్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి అమ్ముతూ పట్టుబడిన ఇద్దరు యువకులను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ సంతోష్ తెలిపారు. గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు సోమవారం సాయంత్రం ఆర్‌కె 6 ఏరియాలోని చెట్ల పొదల వద్దకు వెళ్లగా దెబ్బటి నవదీప్, వడ్డేపల్లి యశ్వంతులు పారిపోయేందుకు యత్నించగా పట్టుకున్నామన్నారు. సోదా చేయగా వారి వద్ద 210 గ్రాముల గంజాయి లభ్యమైంది. 2 సెల్‌ఫోన్లు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

మందమర్రిలో ముగ్గురు అరెస్ట్...

మందమర్రిటౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాష్ట్రీయ రహదారి వద్ద మంగళవారం గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని పట్టుకున్నామని సీఐ శశిధర్‌రెడ్డి తెలిపారు. ఏఎస్‌ఐ శ్రీనివాస్, పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా వారిని చూసి ముగ్గురు వ్యక్తులు పారిపోతుండగా పట్టుకున్నామన్నారు. వారిని తనిఖీ చేయగా 400 గ్రాముల గంజాయి లభించిందన్నారు. మందమర్రిలోని బురదగూడెంకు చెందిన మక్కల గంగాధర్, బండారి వరుణ్, బండారి మధుసూదన్ అదుపులోకి తీసుకుని గంజాయితోపాటు సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నామని, పట్టుకున్న గంజాయి విలువ రూ.12,500 ఉంటుందని తెలిపారు. ఎస్‌ఐ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

బెల్లంపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సింగరేణి రైలులో మంగళవారం అక్రమంగా తరలిస్తున్న 3 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ నరేందర్ తెలిపారు. రామగుండం ఇన్‌స్పెక్టర్ ఆదేశాల మేరకు బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌లో రైలును తనిఖీ చేయగా ప్రయాణికుల సీట్ల కింద, వాష్‌రూం వద్ద 11 సంచుల రేషన్ బియ్యం ఉండడంతో స్వాధీనం చేసుకున్నామన్నారు. రెవెన్యూ అధికారులకు అప్పగించనున్నట్లు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కన్నెపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వీగాంలో పేకాట ఆడుతున్న వారిని మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ గంగారాం తెలిపారు. గాండ్ల మల్లేష్, నన్న రాకేష్, గుజ్జ గుండయ్య, సాయిల్ల బీమేష్, నస్పూరి రమేష్, నన్న వెంకటేశం, గుజ్జ శంకర్, నన్న రనాజేష్, రామకృష్ణలను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 750 నగదు, ఐదు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

తిర్యాణి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పెర్కపల్లి గ్రామానికి ఎందిన చుంచు రాజలింగు(82) చికిత్స పొందుతూ మృతి చెందాడు. కొద్ది రోజుల క్రితం భార్య మృతి చెందింది. అప్పటి నుంచి మనస్తాపంతో ఉంటున్నాడు. ఈ నెల 19న పురుగుల మందు తాగగా కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై మాధవ్ తెలిపారు. రాజలింగు కుమారుడు బాపు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

11 టన్నుల బెల్లం పట్టివేత

సిర్పూర్(టి), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర నుంచి వరంగల్‌కు వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న 11 టన్నుల బెల్లంను పట్టుకున్నట్లు ఎస్సై కమలాకర్ తెలిపారు. వెంకట్రావుపేట సమీపంలో వాహనాల తనిఖీల్లో భాగంగా వరంగల్‌కు చెందిన వ్యాన్(ఎంహెచ్ 40 సీటీ 2503)లో ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న 11.100 టన్నుల బెల్లంను పట్టుకున్నట్లు తెలిపారు. మహారాష్ట్రకు చెందిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు. పట్టుకున్న బెల్ల విలువ సుమారు రూ.5.50 లక్షలు ఉంటుందని ఎస్సై తెలిపారు.

దేశీదారు పట్టివేత

కాగజ్‌నగర్, అక్టోబరు 22: కాగజ్‌నగర్ పట్టణంలోని సంఘం బస్తీలో దేశీదారు బాటిళ్లను పట్టుకున్నట్లు సీఐ శంకరయ్య, ఎస్సై సుధాకర్ తెలిపారు. అందిన సమాచారం మేరకు సంఘం బస్తీకి చెందిన అక్కపక్క సాంబయ్య ఇంటిలో దాడి చేయగా 30 దేశీదారు బాటిల్లు లభించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నెన్నెల పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్‌హౌజ్


నెన్నెలలో ఆయుధాల పనితీరును వివరిస్తున్న ఎస్‌ఐ

నెన్నెల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం నెన్నెల పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్‌హౌజ్ నిర్వహించారు. మండల కేంద్రంలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు ఎస్సై ప్రసాద్ పోలీస్ స్టేషన్ పనిచేసే విధానం, పిటీషన్ మేనేజ్‌మెంట్ ప్రాసెస్, శాంతిభద్రతల పరిరక్షణ, షీటీంల పనితీరు, చట్టాలపై అవగాహన కల్పించారు. ఆయుధాలు పనిచేసే విధానాన్ని వివరించారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ఎస్సై సమాధానాలు ఇచ్చారు.

యువత చెడు వ్యసనాలకు బానిస కావద్దు

తాండూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): యువత చెడు వ్యసనాలకు బానిస కావద్దని సీఐ కుమారస్వామి పేర్కొన్నారు. మంగళవారం మాదారం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆసన్‌మాడలో కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రాం నిర్వహించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలకు జరిమానాలు విధించారు. సీఐ మాట్లాడుతూ గంజాయి సేవించడం, విక్రయం చేయవద్దన్నారు. పిల్లలను పాఠశాలలకు పంపించాలని, ఉన్నత చదువులు చదివించాలని సూచించారు. గ్రామాల్లో సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా ఆపద వస్తే డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. ఎస్‌ఐలు సౌజన్య, గంగారం, విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


నాయకపుగూడ(డీ) తెరుచుకోని గిరిజన పాఠశాల

మూతబడుతున్న గిరిజన పాఠశాలలు

● ఆదివాసీలకు అందని ప్రాథమిక విద్య ● జిల్లాలో పదికి పైగా పాఠశాలల మూసివేత

కాసిపేట, అక్టోబరు 22.(ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల జిల్లాలో టీడబ్ల్యూపీఎస్ పాఠశాలలు మూతబడుతున్నాయి. గిరిజన గూడాల్లో విద్యార్థులు లేరనే కారణంతో బడులను ఎత్తివేస్తున్నారు. సుదూర ప్రాంతాల్లోకి వెళ్లి చదవలేక, ప్రైవేట్‌కు వెళ్ళలేక విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారు. ప్రాథమిక విద్య అందకపోవడంతో గిరిజన ప్రాంతాల్లో డ్రాపౌట్‌ల సంఖ్య పెరిగిపోతుంది. గిరిజన ప్రాథమిక విద్యాలయాల ఉపాధ్యాయులకు పదోన్నతులు, సాధారణ బదిలీలతో ప్రాథమిక పాఠశాలలకు ఉపాధ్యాయులు కరువయ్యారు. ప్రత్యామ్నాయ ఉపాధ్యాయులను కేటాయించకపోవడంతో ఉపాధ్యాయ ఖాళీలతో దర్శనమిస్తున్నాయి.

పిల్లలను ఎక్కడ చదివించాలి



మా ఊరికి వచ్చే ఉపాధ్యాయుడికి మూడు నెలల క్రితం ట్రాన్స్‌ఫర్ అయ్యింది. బడికి ఏ సారు రాకపోవ డంతో పిల్లలు వాగులు, వంకల్లో తిరుగుతున్నారు. దూ రం పంపించి చదివించేందుకు ఆర్థికస్తోమత లేదు. గూడాలను, పిల్లల చదువులను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు.

\- టేకం మారు, పాత తిర్మలాపూర్

రెగ్యులర్ టీచర్లను నియమించాలి



ఖాళీగా ఉన్న గిరిజన పాఠశాలల్లో రెగ్యులర్ టీచర్లను నియమించాలి. చదువుకు దూరమవుతున్న గిరిజన విద్యార్థులను గుర్తించి సమీప పాఠశాలల్లో చేర్పించాలి. పిల్లలు లేరనే సాకుతో మూసివేయడం సరి కాదు. స్పెషల్ డీఎస్సీల ద్వారా టీచర్ల నియామకాలను చేపట్టాలి.

\- వెడ్మ కిషన్, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు

బడులను పునః ప్రారంభిస్తాం



మూతబడిన పాఠశాలలను తెరిపించి పూర్వవైభవం తీసుకువస్తాం. జిల్లా వ్యాప్తంగా 95 మంది సీఆర్‌టీల నియామకాలు చేపట్టాం. మిగిలిన పాఠశాలలకు అదనపు సీఆర్‌టీలను నియమిస్తాం. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి బడుల్లో చేర్పిస్తాం. గిరిజన ప్రాథమిక పాఠశాలలను ప్రక్షాళన చేసి విద్యా విధానాన్ని పటిష్ఠ పరుస్తాం.

\- మడావి గంగారాం , డీటీడీవో

● జిల్లాలో పదికి పైగా మూసివేత

మంచిర్యాల జిల్లాలో 59 టీడబ్ల్యూపీఎస్ పాఠశాలలు ఉం డగా పదికి పైగా బడులు మూతబడ్డాయి. జన్నారం కాంప్లెక్స్ పరిధిలోని నాలుగు గిరిజన పాఠశాలలను నాలుగు ఏండ్ల క్రిత మే మూసివేశారు. దండేపల్లి మండ లంలోని కొత్తకొమ్ముగూడెం, సాముగూడ బడులను మూసివేశారు. జన్నారం మండలంలోని దేవునిగూడ (గోండుగూడ), దేవునిగూడ (నాయకపుగూడ) పాఠ శాలలు మూత పడ్డాయి. జన్నారం మండలంలో ఉపాధ్యా యు లు లేక మరో నాలుగు పాఠశాలలు మూసివేత దిశగా కొనసా గుతున్నాయి. జన్నారం మండలంలోని అల్లినగర్, న్యూపట్టి గూడ, బంగారు చిలక, కంచరబాయి గ్రామాల్లోని బడులు ఉపాధ్యాయులులేక వెలవెలబతున్నాయి. కాసిపేట మండలంలోని కొండాపూర్‌యాప, నాయకపుగూడ (మంచాలరాజయ్య గూడెం), పాతతిర్మలాపూర్, చెన్నూరు మండలం లక్ష్మీపూర్ పాఠశాలల్లోని బడుల్లో ఉపాధ్యాయులు లేక మూసివేశారు.

● దశ మారని దిశ మోడల్ స్కూల్

గిరిజన పాఠశాలల్లో అంగ్లమాధ్యమాన్ని అమలు చేసి నాణ్యమైన విద్యను అందించేందుకు ఐటీడీఏ 2017-18లో దిశ మోడల్ స్కూల్‌లను ప్రారంభించింది. కాసిపేట మం డలంలోని సాలెగూడ, తాటిగూడ, పెద్దాపూర్ గిరిజన పాఠశాలల్లో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టింది. అదే ఏడాది అన్ని గిరిజన పాఠశాలల్లో ఆంగ్లమాధ్యమం అందు బాటులోకి తేవడంతో దిశ మోడల్ స్కూళ్లకు ప్రాధాన్యం తగ్గింది.

అభివృద్ధి చేసి చూపించాం

జన్నారం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పదేళ్ళలో జరగని అభివృద్ధిని 9 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం చేసి చూపించిందని మండల అధ్యక్షుడు ముజాఫర్ ఆలీఖాన్ అన్నారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహి ళలకు ఉచిత బస్ సౌకర్యం, రూ.500 గ్యాస్ సిలిండర్ ఇస్తున్నామ న్నారు. అర్హులందరికి త్వరలో రేషన్ కార్డులు అందిస్తామన్నారు. మేకల మాణిక్యం, ముత్యం రాజన్న, ఇందయ్య, శంకరయ్య, మోహన్‌రెడ్డి, పసివుల్లా, సతీష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

దహెగాం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించు కుని మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం మొబైల్ ఫోన్ వాడకం- జాగ్రత్తలు అనే అంశంపై ఎస్సై రాజు ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు చంద్రశేఖర్, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న ఎస్సై రాజు

న్యూస్ బాక్స్

అత్యాచార నిందితులను శిక్షించాలి

బెల్లపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కలకత్తాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు ఉన్నత విద్య కోసం నగరాలకు వెళ్లి చదివే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా చూడాలని కోరారు. వెంకటి, కృష్ణవేణి, సునీత,దేవమ్మ, బుచ్చమ్మకుమార్, లక్ష్మీ, అమృత తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు పత్రాల అందజేత

నస్పూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నస్పూర్‌లోని తీగల్ పహాడ్ జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం ఎమ్మెల్సీ ఓటరు నమోదు పత్రాలను పంపిణీ చేశారు. ఆదిలాబాద్, మెదక్, కరీంనగర్, నిజామా బాద్ ఉమ్మడి జిల్లాల నియోజకవర్గ ఉపా ధ్యాయ శాసనమండలి సభ్యుడిగా పీఆర్టీ యుటీఎస్ బలపరిచిన వంగ మహేందర్ రెడ్డిని గెలిపించాలని జిల్లా ప్రధాన కార్యదర్శి రాసపల్లి రవి కోరారు. నాగరాజు, రామన్న, వేణుగోపాల్, ఆనంద్ పాల్గొన్నారు.

చెన్నూరు,(ఆంధ్రజ్యోతి): అస్నాదతది తర గ్రామాల్లోని పాఠశాలల్లో మంగళవారం టీఎస్‌పీఆర్‌టీయూ నాయకులు ఎమ్మెల్సీ ఉపాధ్యాయ సభ్యత్వ నమోదు కార్యక్రమా న్ని నిర్వహించారు. మధు, వెంకట స్వామి, కుమార్, రాజేశ్వర్‌రెడ్డి, పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

చెన్నూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): సుబ్బరాంపల్లి గ్రామం లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళ వారం డీఆర్‌డీవో కిషన్ పరిశీలించారు. పిల్లలు, మహిళలు పుష్పగు చ్ఛం అందించి స్వాగతం పలికారు. ఎంపీడీవో మోహన్, ఏపీవో గంగాభవానీ, సూపర్‌వైజర్ మాధవి, టీచర్ లక్ష్మీ పాల్గొన్నారు.

అవగాహన కలిగి ఉండాలి

కాసిపేట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రతి కార్మికుడు రక్షణ పట్ల అవగాహన కలిగి ఉండాలని ఓరియంట్ సిమెంట్ కంపెనీ యూనిట్ హెడ్ బాల గిరిధర్ అన్నారు. మంగళవారం దేవాపూర్ సిమెంట్ కంపెనీలో జరిగిన ఫైర్స్ భద్రత వారోత్సవాలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్మికులు భద్రత, రక్షణ చర్యలు పాటిస్తూ ఉత్పత్తి కొనసాగించాలన్నారు. అనంతరం కార్మికులచేత రక్షణ ప్రతిజ్ఞ చేయించారు.

సమస్యలు పరిష్కరించకుంటే నిరవధిక సమ్మె


జైపూర్‌లో మాట్లాడుతున్న హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్

జైపూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జైపూర్ పవర్ ప్లాంట్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే నిరవధిక సమ్మె తప్పదని హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ అన్నారు. జైపూర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్టీపీపీలో వివిధ కంపెనీల్లో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పద్ధతుల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ఎస్టీపీపీ యాజమాన్యం విఫలమైందన్నారు. పవర్ ప్లాంట్ నిర్మాణ సమయంలో భూముల కోల్పోయిన వారు ప్లాంటు మొదలు నుంచి విధులు నిర్వహిస్తున్న వారు చాలీ చాలని వేతనాలతో కుటుంబాలను పోషించుకుంటున్నా రన్నారు. కార్మికుల న్యాయమైన హక్కులు, డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని , సమాన పనికి సమానవేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఒక రోజు టోకెన్ సమ్మె నిర్వహిస్తామని, అయినా పరిష్కరించకపోతే నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. కార్మికులు సమ్మె చేస్తే సింగరేణి యాజ మాన్యమే పూర్తి బాధ్యత వహించాలన్నారు. సమావేశంలో నాయకు లు జక్కుల నారాయణ, విక్రమ్‌కుమార్, చిప్పకుర్తి సంపత్, సందీప్‌రెడ్డి, నవీన్‌చారి, కృష్ణరెడ్డి, సంతోష్‌రెడ్డి, నర్సింహారెడ్డి, సత్యానారాయణ తదితరులు పాల్గొన్నారు.

పవర్ ప్లాంటు స్థలం చదును

మందమర్రిటౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో సింగరేణి సోలార్ పవర్ ప్లాంటు ఏర్పాటుకు సంబంధించి స్థలాన్ని చదును చేస్తున్నారు. సుమారు 20 ఎకరాల్లో ముళ్ల పొదలను తొలగించారు. జీఎం దేవేందర్ పనులు పర్యవేక్షిస్తున్నారు.

మరిన్ని బహుమతులు సాధించాలి

మందమర్రిటౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మందమర్రి రెస్క్యూటీం సభ్యులు భవిష్యత్‌లో నిర్వహించే పోటీల్లో మరిన్ని బహుమతులు సాధించాలని మందమర్రి జీఎం దేవేందర్ తెలిపారు. ఇటీవల ఆర్జీ2లోని రెస్క్యూ స్టేషన్ ఆవరణలో నిర్వహించిన జోనల్ మైన్స్ రెస్క్యూ పోటీల్లో మందమర్రి ఏరియా రెస్క్యూటీం బెస్ట్ ఇన్ ఫస్ట్ ఎయిడ్, బెస్ట్ సెకండరీ రెస్క్యూ రికవరీ, ఓవరాల్‌గా మూడు బహుమతులు గెలుపొందగా జీఎం సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, రెస్క్యూ స్టేషన్ ఇన్‌చార్జీ రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు అండగా ఉంటాం

\- ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ


మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

మందమర్రిటౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సంక్షేమం కోసం, హక్కుల సాధన కోసం తమ యూనియన్ కార్మికులకు అండగా ఉంటుందని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ తెలిపారు. మంగళవారం కేకే 5 గనిపై కార్మికులను కలిసి మాట్లాడారు. సింగరేణిలో రాజకీయ జోక్యం మితిమీరిపోతుందని విమర్శించారు. కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికల్లో తమ యూనియన్‌ను కార్మికులు గెలిపించారని చెప్పారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తామని చెప్పారు. యాజమాన్యం ఉత్పత్తి, ఉత్పాదకతపై దృష్టి సారిస్తూ కార్మికులను నిర్లక్ష్యం చేస్తోందన్నారు. తాము కార్మికకుల పక్షాన పోరడుతామని తెలిపారు. ఇప్పటికైనా యాజమాన్యం నాణ్యమైన పరికరాలు కార్మికులకు అందించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సుదర్శన్, శ్రీనివాస్, రాజేశం, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల బదిలీలకు వెబ్ కౌన్సెలింగ్

శ్రీరాంపూర్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల బదిలీలకు మంగళవారం శ్రీరాంపూర్ వృత్తి శిక్షణ కేంద్రంలో వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించారు. శ్రీరాంపూర్, మందమర్రి ఏరియాలకు చెందిన చార్జ్‌హ్యాండ్ ఎలక్ట్రికల్ ఫోర్‌మెన్లు 23 మంది హాజరయ్యారు. ఇందులో 10 మంది ఉద్యోగులు ఆప్షన్లు ఇచ్చుకున్నారు. కార్యక్రమంలో డీజీఎం(పర్సనల్) అరవిందరావు, డీజీఎం (ఐఈడీ) చిరంజీవులు, వీటీసీ ఇన్‌చార్జి మేనేజర్ అమర్‌నాథ్ రెడ్డి, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ రాజేశ్వర రావు, సీనియర్ అసిస్టెంట్ కె. శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి తావులేకుండా పదోన్నతులు

శ్రీరాంపూర్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): అవినీతికి తావులేకుండా సర్ఫేస్ జనరల్ మజ్దూర్ పదోన్నతులు కల్పించామని ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య అన్నారు. శ్రీరాంపూర్ ఓసీపీలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మా ట్లాడారు. ఏఐటీయూసీ గుర్తింపు సంఘంగా సింగరే ణిలో గెలిచినప్పటి నుంచి కార్మికుల సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు. బదిలలీ వర్కర్ కార్మికులకు జనరల్ మజ్దూర్లుగా పదోన్నతులు కల్పించామన్నారు. ప్రభుత్వం నుంచి సింగరేణికి రావాల్సిన 33 వేల కోట్ల రూపాయల బకాయిలు వస్తేనే సంస్థకు మనుగడ ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం స్పందించి నిధులు విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్ర మోహన్, జీఎం చర్చల కమిటీ ప్రతినిధి బద్రి బుచ్చయ్య, పిట్ కార్యదర్శి మోతె లచ్చయ్య, నాయ కులు అఫ్రోజ్‌ఖాన్, సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి వీరభద్రయ్య



కారుణ్య నియామకాలతో యువతకు ఉపాధి



నియామకపత్రం అందజేస్తున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కారుణ్య నియామకాలతో యువతకు ఉపాధి లభిస్తుందని శ్రీరాంపూర్ ఏరియా జీఎం బి సంజీవరెడ్డి అన్నారు. 28 మంది యవతీ యువకులకు మంగళవారం ఆయన జీఎం కార్యాలయంలో కారుణ్య నియామకపత్రాలు అందించారు. అనంతరం మాట్లాడుతూ సింగరేణిలో ఉద్యోగం లభించడం అదృష్టంగా భావించాలన్నారు. ఇచ్చిన పనిని పూర్తి చేస్తూ నైపుణ్యం పెంచుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. సింగరేణి ప్రగతిపథంలో వెళ్లాలంటే ఉద్యోగుల కృషి అవసరమని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఓ టు జీఎం ఎన్. సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్ రెడ్డి, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, సీనియర్ పీవో కాంతారావు, అసిస్టెంట్ సూపరింటెండెంట్ సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్ రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

నూతన గనులు ఏర్పాటు చేయాలని కోరుతాం

మందమర్రిటౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో బుధవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే పారిశ్రామిక సంబంధాలు -యూనియన్‌ల పాత్రపై నిర్వహించే సదస్సులో నూతన గనులు ఏర్పాటు చేయాలని కోరుతామని ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య అన్నారు. సింగరేణి యాజమాన్యం నిర్వహించే సదస్సుకు ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్, రాష్ట కనీస వేతనాల మండలి చైర్మన్ జనక్ ప్రసాద్ స్థానంలో ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్యను ఎంపిక చేశారు. దీంతో ఆయన హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు.

కార్పొరేట్ జీఎం సర్వే అధికారికి సన్మానం

మందమర్రిటౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) జీఎం కార్యాల యంలో మంగళవారం ఏరియాకు మొదటిసారిగా వచ్చిన కొత్తగూడెం కార్పొరేట్ జీఎం సర్వే అధికారి జైనుల్లాఉద్దీన్‌ను మందమర్రి జీఎం దేవేందర్ సన్మానించారు. కార్యక్రమంతో ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

తొలగిన అడ్డంకులు..

5వ పేజీ తరువాయి..

అందించడం ద్వారా ఆయకట్టు రైతుల్లో ఆనందం నింపేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. నిధుల చెల్లింపు ప్రక్రియ సకాలంలో పూర్తయి పనులు ప్రారంభిస్తే ఈ ఏడాది చివరలో ప్రాజెక్టు పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయని కేంద్ర జల సంఘం చైర్మన్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించడంతో త్వరలోనే కేంద్ర అటవీశాఖ అనుమతులు జారీ చేసే అవకాశాలు ఉన్నాయి.

వర్కింగ్ పర్మిట్ వస్తే పనులకు ఓకే...

రాష్ట్ర ప్రభుత్వం అటవీశాఖకు నగదు చెల్లించినందున వర్క్ పర్మిట్ రావాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వం అనుమతులు జారీ చేసి వెంటనే పనులు ప్రారంభించేందుకు కాంట్రాక్టింగ్ సంస్థ సిద్ధంగా ఉంది. ప్రాజెక్టు నిర్మాణ పనులను 2011లో ఆనాటి ప్రభుత్వం హైదరాబాద్‌లోని ఆర్కే రత్న ఏజెన్సీకి అగ్రిమెంట్ చేసింది. ప్రస్తుతం అదే ఏజెన్సీతో పనులు కొనసాగించేందుకు ప్రస్తుత ప్రభుత్వం కూడా సిద్ధంగా ఉంది. ఈ మేరకు ఏజెన్సీ కూడా అవసరమైన ఏర్పాట్లలో నిమగ్నం కాగా, సకాలంలో అనుమతులు వస్తే పనులు ప్రారంభం కానున్నాయి.

మూడు నెలల్లో పనులు పూర్తి చేస్తాం..

కేంద్ర అటవీశాఖ కోరిన మేరకు సంబంధిత నిధులను గత నెలలో డిపాజిట్ చేశాం. పనులు చేపట్టేందుకు వర్క్ పర్మిట్ కోసం వేచి చూస్తున్నాం. ఈ అంశంపై ఈ నెల 23న హైదరాబాద్‌లో ప్రభుత్వపరంగా ఏర్పాటు చేయనున్న ఉన్నతస్థాయి సమావేశంలో విధివిధానాలు రూపొందించే అవకాశాలు ఉన్నాయి. దీపావళి అనంతరం పనులు ప్రారంభించి, మూడు నెలల్లో పూర్తి చేసేందుకు కృషి చేస్తాం.

- ఇరిగేషన్ డీఈ వెంకటస్వామి

నాసిరకంగా పాఠశాల పనులు

జైపూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : పెగడపల్లి గ్రామంలో రూ. 50 లక్షలతో చేపడుతున్న ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించడం లేదని స్థానికులు వాపోతున్నారు. గతంలో ఇతర పనులకు వినియోగించిన ఇనుప సామగ్రి, ఇసుకను వాడుతున్నారని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. పెగడపల్లి గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకుడే కాంట్రాక్టర్‌గా ఉండడంతో అధికారులు అతనిపై చర్యలు తీసుకోవడం లేదన్నారు. టీజీఈడబ్ల్యూఐ డీసీ రాజేశ్వర్‌రెడ్డిని ఫోన్‌లో వివరణ కోరగా నాణ్యత పాటించకుంటే సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నాణ్యతగా ఉండేలా చూస్తామన్నారు.

కుమరం భీం జిల్లా కాగజ్‌నగర్ అటవీ డివిజన్‌లోని పెంచికలపేట్ రేంజ్ అరుదైన వృక్ష శిలాజాలకు కేరాఫ్‌గా నిలుస్తోంది. కొండపల్లి, బొంబాయిగూడ అటవీ ప్రాంతంలో 20 ఎకరాల విస్తీర్ణంలో ఉన్నట్లు అధికార యంత్రాంగం గుర్తించడంతో ప్రాధాన్యం సంతరించుకుంది.



పెంచికలపేట రేంజ్‌లో బయట పడ్డ వృక్ష శిలాజాలు



పెంచికలపేట వృక్ష శిలాజాల కోట

- కొండపల్లి, బొంబాయిగూడ అడవుల్లో గుర్తింపు
- 20 ఎకరాల విస్తీర్ణంలో పలు రకాల శిలాజాలు
- రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్న స్థానికులు







పెంచికలపేట్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : కుమరం భీం జిల్లా కాగజ్‌నగర్ అటవీ డివిజన్‌లోని పెంచికలపేట్ రేంజ్‌కు ఓ ప్రత్యేకత ఉంది. సిద్ధేశ్వర గుహలు, ప్రాణహిత పెద్ద వాగు సంగమం, జలపాతాలు, ఎత్తైన కొండలు, పొడవు ముక్కు రాబందులు, గడ్డి మైదానాలు, పెద్ద పులులు, పలు రకాల పక్షి జాతులు, అరుదైన వృక్ష శిలాజాలకు ఈ ప్రాంతం ప్రసిద్ధిగాంచింది.

● శిలాజాలు అంటే..

ప్రకృతి సిద్ధ కారణాల వల్ల భూమిలో భద్రపరచబడిన కచ్చితమైన జీవావశేషాలను గానీ, వాటి ఆనవాళ్లను గానీ శిలాజాలు అని పిలుస్తారు. ఎదైనా ప్రాణి సహజంగానో, ప్రకృతిలో సంభవించే ప్రమాదాల వల్లనో మరణించినప్పుడు భూగర్భంలో కూరుకుపోతుంది. ఈ విధంగా కూరుకుపోయిన ప్రాణి భౌతిక శరీరంపై పని చేసే పీడన బలాలు భౌతిక శరీరాన్ని శిలగా మార్చుతుంది. లేక ఆ భౌతిక శరీరాన్ని అంటిపెట్టి ఉన్న పదార్థాలపై ప్రాణి భౌతిక చిహ్నాన్ని ఏర్పరుస్తుంది. ఈ విధంగా ఏర్పడిన శిలలను, చిహ్నాలను(ముద్రలను) సాధారణంగా శిలాజాలు అంటారు. జీవజాతులు ఉనికి, వాటిలో సంభవించిన పరిణామక్రమాన్ని అధ్యయనం చేయడానికి శిలాజాల పరిశీలన వల్లనే సాధ్యమవుతుందని చెబుతారు. భూమండలంపై వివిధ యుగాల్లో విశిష్టమైన జంతు, వృక్ష జాతులు ఉండేవి. వీటి శిలాజాలు లభించడం వల్ల ఆ కాలపు శిలల వయస్సును నిర్ణయించడంలో ఇవి ఎంతో ఉపయోగపడుతాయి. ఇటువంటి శిలాజాలను సూచికా శిలాజాలు అంటారు.

● 2013లో రేంజ్ పరిధిలో..

పెంచికలపేట్ రేంజ్ పరిధిలో సుమారు 15కిలో మీటర్లు ఉన్న కొండపల్లి, బొంబాయిగూడ అటవీ ప్రాంతంలో 2013లోవృక్ష శిలాజాలను అధికారులు గుర్తించారు. సుమారు 20 ఎకరాల విస్తీర్ణంలో వివిధ రకాల వృక్ష శిలాజాలు ఉన్నట్లు అధికారులు ధ్రువీకరించారు. పలుమార్లు సర్వే చేసి కొన్ని శిలాజాలు 9 నుంచి 25 వరకు అడుగుల పొడవు, మరికొన్ని 50 అడుగుల పొడవు ఉన్నట్లు తెలిపారు. 2015లో తెలంగాణ చరిత్రకారులు బృందం సైతం ఈ ప్రాంతాన్ని సందర్శించి రక్షణ చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి సిఫారసు చేసింది. అప్పటి కలెక్టర్ చంపాలాల్ ఈ ప్రాంతాన్ని సందర్శించి ఫాజిల్ పార్కుగా అభివృద్ధి చేయాలన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. వీటి వల్ల చరిత్రకు సంబంధించిన ఎన్నో విషయాలు బయటకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఈ ప్రాంతాన్ని మరింత క్షుణ్ణంగా పరిశీలిస్తే రాక్షస బల్లుల శిలాజాలు వెలుగు చూసే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. గతంలో మంచిర్యాల జిల్లా వేమనపల్లి అటవీ ప్రాంతంలో రాక్షస బల్లి శిలాజం లభ్యం కాగా దానిని హైదారాబాద్ బిర్లా సైన్స్ సెంటర్‌లో ప్రదర్శనకు పెట్టారు. ప్రభుత్వం, అటవీ శాఖ చొరవ తీసుకుని పరిశీలిస్తే ఈ ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందుతుంది.

● వడగాంలో ఫాజిల్ పార్క్..

కోన్నేళ్లక్రితం మహారాష్ట్ర - తెలంగాణ సరిహద్దులోనున్న గడ్చిరోలికి 15కిలో మీటర్ల దూరంలోని వడగాంలో వృక్ష శిలాజాలను శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇవి 6.5 కోట్ల ఏళ్ల క్రితం ఏర్పడి ఉంటాయని జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అధికారులు భావించారు. ఈ ప్రాంతాన్ని వడగాం ఫాజిల్ పార్కుగా అభివృద్ధి చేశారు. పెంచికల్‌పేట మండలంలోని కొండపల్లి అటవీ ప్రాంతంలోని శిలాజాలు వయసు కూడా అంతే ఉంటుందని అంచానా వేశారు. వడగాం ఫాజిల్ పార్కులాగే కొండపల్లిలోనూ ఏర్పాటు చేస్తే స్థానికులకు ఉపాధి దొరికే అవకాశం ఉందని ఈ ప్రాంత వాసులు అభిప్రాయపడుతున్నారు.

విద్యుత్ వినియోగంపై రైతులకు అవగాహన



పొలంబాటలో పాల్గొన్న రైతులు, విద్యుత్ శాఖ అధికారులు

నస్పూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నస్పూర్ విలేజ్‌లో పొలంబాట కార్యక్రమం ద్వారా విద్యుత్ వినియోగంపై మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. నాణ్యత కలిగిన విద్యుత్ మోటార్లను, స్టార్టర్లను వినియోగించాలని సూచించారు. పొలాల వద్ద వ్యవసాయ పంపు సెట్లకు విద్యుత్ వినియోగం, వాడకంపై సూచనలు, సలహాలను ఇచ్చారు. పొలాల్లో, వీధుల్లో ఎక్కడైనా విద్యుత్ వైర్లు వేలాడిన, స్తంభాలు వంగిపోయిన సమాచారం ఇవ్వాలన్నారు. రైతులు ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫీజులు తీయడం, వేయడం చేయవద్దని, సిబ్బందిచే చేయించాలన్నారు. ఆటో స్టార్టర్లను వాడవద్దని విద్యుత్ శాఖ అధికారులు సూచించారు. కౌన్సిలర్ సీపతి సుమతిమల్లేష్, ఏడీఈ మోహన్ రెడ్డి, ఏఈ శ్రీనివాస్, లైన్‌మన్ వెంకటస్వామి, ఏఎల్ఎం మధుకర్, రైతులు రమేష్, పరమేష్, మల్లయ్య, శ్రీనివాస్, రవి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కాకో ఆలయానికి తరలివస్తున్న గిరిజనులు



కాకో అమ్మ ఆలయంకు గిరిజన సాంప్రదాయ డోలు వాయ్యిదాలతో వస్తున్న గిరిజనం

దండేపల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : గుడిరేవులోని పద్మల్‌పురి కాకో ఏత్మల్‌సార్ పేన్ ఆలయానికి గిరిజనులు తరలివస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నలుమూలల నుంచి మంగళవారం కుటుంబ సమేతంగా కాకో అమ్మావారిని దర్శించుకున్నారు. దీపావళి పండుగ ముగిసే వరకు నియమనిష్టలతో అమ్మవారికి పూజలు చేస్తారు. గిరిజనులు డప్పువాయిద్యాలతో గుస్సాడీ వేషధారణలు, నృత్యాలతో ఆలయానికి చేరుకున్నారు. అనంతరం ఆలయం చుట్టు ప్రదక్షిణ చేసి కాకో అమ్మావారికి గంగ జలభిషేకం చేశారు. ఆలయం వద్ద రకరకాల పిండి పదార్థలు తయారు చేసి కోళ్లలను, మేకలను అమ్మవారికి బలి ఇచ్చారు. గుస్సాడి నృత్యాలతో సందడి చేశారు.

అయోడిన్ ఉప్పునే వినియోగించాలి



పోస్టర్లను విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో, డాక్టర్‌లు

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు అయోడిన్ ఉప్పునే వినియోగించాలని డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్ అన్నారు. మంగళవారం ప్రపంచ అయోడిన్ లోప రుగ్మతల నివారణ దినోత్సవం సందర్భంగా డీఎంహెచ్‌వో కార్యాలయంలో అయోడిన్ ఉప్పు వల్ల కలిగే ప్రయోజనాలతో కూడిన పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ అయోడిన్ ఉప్పు వాడడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యంతో పిల్లల ఎదుగుదల సక్రమంగా ఉంటుందన్నారు. వారిలో జ్ఞాపక శక్తి పెరుగుతుందన్నారు. ఈ విషయాలపై కళాశాలలు, పాఠశాలల్లో వైద్యాధికారులు, సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. అలాగే వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు గ్రామాల్లోని ప్రజలకు అయోడిన్ ఉప్పు ప్రాముఖ్యతను తెలియజేయాలని సూచించారు. డాక్టర్‌లు ప్రసాద్, సుధాకర్‌నాయక్, అనిల్, విశ్వేశ్వర్‌రెడ్డి, సూపరింటెండెంట్ ప్రశాంతి, డీపీ లింగారెడ్డి, వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

వ్యవసాయంపై అవగాహన

మందమర్రిరూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : సమీకృత వ్యవసాయంపై జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం జగిత్యాల, సిరిసిల్ల కళాశాల విద్యార్థులకు ఏవో కిరణ్మయి, ఏఈవోలు ముత్యం తిరుపతి, కనకరాజులు మంగళవారం బొక్కలగుట్ట, సారంగపల్లి గ్రామాల్లో అవగాహన కల్పించారు. డ్రోన్ వినియోగం, పాడి, చేపల పెంపకం, కోళ్ల పెంపకం, విత్తనాలు నాటడం, కలుపు తీయడం, సేంద్రియ ఎరువుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తిరుపతి, శ్రీధర్, శ్రీచరణ్,నితిన్, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా కుమరంభీం జయంతి

కాసిపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఆదివాసీల ఆరాధ్య దైవం కుమరంబీం జయంతి వేడుకలను మంగళవారం దేవాపూర్‌లో ఆదివాసీ నాయకులు ఘనంగా నిర్వహించారు. దండారీ దర్బార్ నిర్వహణ అధ్యక్షుడు ఆడె జంగు భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భీం చేసిన పోరాటాలను కొనియాడారు. గిరిజన సంఘాల నాయకులు పెంద్రం హన్మంతు, వెడ్మ కిషన్, సూరు, అనంతరావు, రవీందర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

భీమారం,(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూరుగుపల్లిలో కుమరంభీం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామస్తులు శంకర్‌నాయక్ , మారయ్య, బాపు, అశోక్,మల్లేష్, విగ్నేష్, రవితేజతదితరులు పాల్గొన్నారు.



దేవాపూర్‌లో కొమురంభీం విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులు

చెట్టు కింద పరీక్షలు



చెట్టు కింద పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

బెల్లంపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చర్లపల్లి ప్రైమరీ ప్రభుత్వ పాఠశాలలో ఎస్ఏ 1 పరీక్షలు విద్యార్థులకు చెట్లకింద నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాల శిథిలావస్థలో ఉండడంతో కూల్చివేశారు. రూ. 8.10 లక్షలతో నూతన భవన నిర్మాణ పనులు చేపడుతున్నారు. దీంతో ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణలో ఉన్న చెట్ల కింద పరీక్షలు పెడుతున్నారు. ఈ భవన నిర్మాణం పూర్తి కావాలంటే మరో ఏడాది కాలం సమయం పట్టనుంది. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్లపల్లి గ్రామంలో తాత్కాలిక భవనం ఏర్పాటు చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

పారిశుధ్య కార్యక్రమాలను నిరంతరం కొనసాగించాలి

నెన్నెల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాన్ని స్వచ్ఛంగా ఉంచేందుకు పారిశుధ్య కార్యక్రమాలను నిరంతరం కొనసాగించాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం నెన్నెలలో పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణను పరిశీలించారు. అభివృద్ధి పనులపై కార్యదర్శిని సురేష్‌ను అడిగి తెలుసుకున్నారు. జీపీలో రికార్డులు పరిశీలించి, నిధుల వ్యయంపై వాకబు చేశారు. డీపీవో మాట్లాడుతూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత లోపిస్తే సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉంటుందన్నారు. డంపింగ్ యార్డు, వైకుంఠధామం, పల్లెప్రకృతి వనం, క్రీడా మైదానాలను పరిశీలించారు. కస్తూర్బాగాంధీ పాఠశాలలో



గ్రామ పంచాయతి కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న డీపీవో

మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఎంపీవో శ్రీనివాస్ ఉన్నారు.

ధరల పట్టిక తప్పనిసరి

భీమిని, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎరువులు, పురుగుల మందు దుకాణంలో తప్పనిసరిగా ధరల పట్టికలు ఉండాలని వ్యవసాయ శాఖ ఏడీఏ సురేఖ అన్నారు. మంగళవారం భీమిని, వెంకటాపూర్ గ్రామాల్లోని ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ధరలకు సంబంధించిన బిల్లులను, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ధరల పట్టిక సక్రమంగా లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎరువులు, పురుగుల మందులను కొనుగోలు చేసినప్పుడు రైతులు తప్పని సరిగా రసీదులు తీసుకోవాలన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏఈఓ వినోద్ ఉన్నారు.

నర్సరీలను పరిశీలించిన డీఆర్‌డీవో

చెన్నూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : సోమనపల్లి, ఆస్నాద, పొన్నారం, సంకారం గ్రామాల్లోని నర్సరీలను మంగళవారం డీఆర్‌డీవో కిషన్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి నర్సరీ నిర్వహణ ఎర్రమట్టి, నల్లమట్టి సేంద్రీయ ఎరువులతో బ్యాగ్ ఫిల్లింగ్ చేసి డిమాండ్‌కు అనుకూలంగా విత్తనాలు నాటి పనులను వేగవంతం చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో మోహన్, ఏపీవో గంగాభవాణి ఉన్నారు.

సభ్యత్వ నమోదు పరిశీలన

కోటపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో బీజేపీ సభ్యత్వ నమోదును మంగళవారం ఆ పార్టీ మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు మంత్రి రామయ్య, పెద్దింటి పున్నంచంద్‌లు పరిశీలించారు. పలువురికి సభ్యత్వనమోదు అందించారు. ప్రధానమంత్రి పనితీరుతోనే ఆకర్షితులై పలువురు సభ్యత్వ నమోదు తీసుకుంటున్నట్లు వారు తెలిపారు. సభ్యత్వ నమోదు ఇన్‌చార్జీ వంశీగౌడ్, పాల్గొన్నారు.

వీధి దీపాలను ఏర్పాటు చేయాలి

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు రంగంపేటలో వీధి దీపాలను ఏర్పాటు చేయాలని మంగళవారం బొలిశెట్టి కిషన్ ఆధ్వర్యంలో ప్రజలు మున్సిపల్ చైర్మన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. 30 యేండ్ల నుంచి వీధి దీపాలు లేక ఇబ్బందులు పడాల్సివస్తుందని వారు పేర్కొన్నారు.

డాక్టరేట్ సాధించిన అధ్యాపకుడికి సన్మానం

చెన్నూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కిష్టంపేట గ్రామంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జంతుశాస్త్ర విభాగంలో గెస్ట్ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్న దారిశెట్టి కృష్ణ గోపాల్‌రావు పీహెచ్‌డీని సాధించాడు. మంగళవారం ప్రిన్సిపాల్ పట్వర్ధన్, అధ్యాపకులు ఆయనను సన్మానించారు. ఉత్తరప్రదేశ్ సహారాపూర్‌లోని గ్లోకల్ యూనివర్శిటీ నుంచి జంతుశాస్త్ర విభాగంలో ఇన్వెస్టిగేషన్ ఇన్‌టూ ఆడాలసిస్ ఆవర్నెస్ అండ్ అంటీయాటిటూడ్ రిగార్డింగ్ రిప్రోడెక్టింగ్ హెల్త్ అనే అంశంపై పరిశోధన చేసినందుకు కృష్ణ గోపాల్‌రావుకు ఆ యూనివర్శిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది.

అడుగడుగునా గుంతలే...

- రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- మరమ్మతు చేపట్టాలని ప్రజల వేడుకోలు
- పట్టించుకోని అధికారులు, నాయకులు



గుంతలమయంగా రాంపూర్ టేకులపల్లి రహదారి

భీమిని, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం నుంచి బెల్లంపల్లికి వెళ్ళే రాంపూర్ టేకులపల్లి రహదారి మూడు కిలోమీటర్ల బీటీ రోడ్డు గుంతమయంగా మారింది. రోడ్డంతా గుంతలమయం కావడంతో తరుచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. రోజూ మండల కేంద్రం నుంచి నియోజకవర్గం బెల్లంపల్లికి వివిధ పనుల నిమిత్తం మండల ప్రజలు వచ్చి వెళ్తుంటారు. రోడ్డుకు అడుగడునా గుంతలు ఉండటంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఐదు ఏళ్ల క్రితం రహదారికి మరమ్మతు చేసినప్పటికి యేడాదిలోనే మళ్లీ గుంతలమయంగా మారింది. మండల ప్రజలకు ప్రధానమైన ఈ రహదారి మరమ్మతు అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- ఆర్‌అండ్‌బీ పరిధిలో లేనందునే....

బెల్లంపల్లి నియోజకపరిధి నుంచి భీమిని వెళ్లే రహదారి పంచాయతీరాజ్ పరిధిలో ఉండటం వల్లనే రోడ్డుకు నిధులు రావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. మండల సర్వసభ్య సమావేశాల్లో కూడా ఈ రోడ్డును ఆర్‌అండ్‌బీ పరిధిలోకి తేవాలని సభ్యులు పలుమార్లు తీర్మానాలు చేసి పంపినప్పటికీ ప్రయోజనం లేకుండాపోయింది. సంబంధిత శాఖల అధికారులు రోడ్డు సమస్య పరిష్కారానికి చొరవ చూపకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి రహదారి పునర్నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కంకర రోడ్డుపై నరకయాతన

దండేపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మామిడిపల్లి నుంచి కంచారబాయి గ్రామం వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. రోడ్డు నిర్మాణ పనులు రూ. 1కోటికి పైగా నిధులతో ప్రారంభించి ఏడాది దాటిన ఇంకా అసంపూర్తిగా మిగిలిపోయింది. సంబంధిత కాంట్రాక్టర్ రోడ్డుపై కంకర పోసి వదిలివేశాడు. దీంతో కంచారబాయి గిరిజనులతో పాటు మామిడిపల్లి, కొత్త మామిడిపల్లి గ్రామాల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి కంకర రోడ్డుపై బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని గిరిజనులు, రైతులు కోరుతున్నారు.



కంకర పోసి వదిలేసిన రోడ్డు

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

మంచిర్యాల
జిల్లా వార్తలు
5
బుధవారం 23 అక్టోబరు 2024

ట్రాఫిక్ ఇబ్బందులు కలుగకుండా చర్యలు

బెల్లంపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత అన్నారు. మంగళవారం కూరగాయల మార్కెట్ ఎదుట ఉన్న బంకర్ స్థలాన్ని పరిశీలించారు. బస్టాండ్ నుంచి కాంటా చౌరస్తా వరకు రోడ్లపై వ్యాపారాలు చేయరాదని, డ్రైనేజీల మీద అమ్మకాలు చేపట్టరాదన్నారు. బంకర్ స్థలంలో స్థలాలను కేటాయిస్తామన్నారు. కౌన్సిలర్ సురేష్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

మూతబడుతున్న గిరిజన పాఠశాలలు

- ఆదివాసీలకు అందని ప్రాథమిక విద్య
- జిల్లాలో పదికి పైగా పాఠశాలల మూసివేత



తాటిగూడంలోని మోడల్ స్కూల్

6

పెంచికలపేట.. వృక్ష శిలాజాల కోట

- కొండపల్లి, బొంబాయిగూడ అడవుల్లో గుర్తింపు
- 20 ఎకరాల విస్తీర్ణంలో పలు రకాల శిలాజాలు
- రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్న స్థానికులు


పెంచికలపేట రేంజ్‌లో బయట పడ్డ వృక్ష శిలాజాలు

7

రౌడీషీటర్లు పద్ధతి మార్చుకోవాలి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీపీ

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్లు పద్ధతి మార్చుకోవాలని, నేరాలకు పాల్పడకుండా సత్ప్రవర్తనతో మెలగాలని, లేదంటే కమిషనరేట్ పరిధి నుంచి బహిష్కరిస్తామని రామగుండం సీపీ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మంచిర్యాల పోలీస్‌స్టేషన్‌లో రౌడీ షీటర్స్‌కు కౌన్సెలింగ్ నిర్వహించి వార్నింగ్ ఇచ్చారు. రౌడీషీట్ ఉన్న ప్రతీ ఒక్కరిపై నిఘా ఉంటుందని, మార్పు రాకపోతే కఠినంగా వ్యవహరిస్తామని, పీడీ యాక్టు అమలు చేస్తామన్నారు. ఇకపై ఎలాంటి కేసుల్లోనైనా వారి పేర్లు వినిపించినా, ఉన్నట్లు తెలిసినా శాశ్వతంగా జైలు జీవితం గడిపేలా చేస్తామని హెచ్చరించారు. నేరాలకు పాల్పడకుండా సత్ప్రవర్తనతో మెదిలితే రౌడీషీట్‌లను ఎత్తివేస్తామన్నారు. గంజాయి, పీడీఎస్ రైస్, నకిలీ విత్తనాలు, గుట్కా రవాణాకు పాల్పడినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. డీసీపీ ఎ.భాస్కర్, మంచిర్యాల, జైపూర్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీలు ఆర్.ప్రకాష్, వెంకటేశ్వర్లు, రాఘవేంద్రరావు, టౌన్, రూరల్ సీఐలు ప్రమోద్‌రావు, అశోక్‌కుమార్, సీఐలు నరేందర్, రవీందర్, శశిధర్‌రెడ్డి, దేవయ్య, అఫ్జలోద్దీన్, నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

మంచిర్యాల పోలీస్ స్టేషన్‌ను పరిశీలించిన సీపీ

మంచిర్యాల పట్టణ పోలీస్‌స్టేషన్‌ను సీపీ శ్రీనివాస్ డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాష్‌లతో కలిసి మంగళవారం తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను, పెండింగ్ ఫైల్స్ పరిశీలించి దర్యాప్తుల్లో ఉన్న కేసులపై ఆరా తీశారు. ట్రైనీ ఎస్సైతో మాట్లాడి స్టేషన్‌లో రికార్డులు, చేయాల్సిన విధుల గురించి అధికారులను, సిబ్బందిని తెలుసుకోవాలని సూచించారు. అనంతరం నేరాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు సీపీ పలు సూచనలు చేశారు.

మున్సిపాలిటీలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు

మందమర్రిటౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మందమర్రి మున్సిపాలిటీ అభివృద్ధికి చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి పెద్దపీట వేస్తున్నారని, దాదాపు రూ. 36 కోట్ల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బండి సదానందం యాదవ్ తెలిపారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో మున్సిపాలిటీ అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నారన్నారు. నరేష్, జగదీష్, రాజయ్య, రాకేష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సదానందం యాదవ్

న్యూస్ బాక్స్

రైల్వే జీఎంను కలిసిన ఎమ్మెల్యే


జీఎంకు వినతి పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే వినోద్‌వెంకటస్వామి

తాండూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రేచిని రోడ్డు రైల్వేస్టేషన్‌లోని సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే గడ్డం వినోద్‌వెంకటస్వామి మంగళవారం సికింద్రాబాద్ దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్‌ను కలిసి వినతిపత్రం అందించారు. రైల్వే స్టేషన్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పొడిగించాలని, సింగరేణి, రామగిరి రైళ్లను నిలపాలని కోరారు. రైల్వేస్టేషన్‌లో సౌకర్యాలు కల్పించాలని విన్నవించారు. బానయ్య, రవీందర్‌రెడ్డి, గట్టు మురళీదర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీపీపీలో నిలిచిన ఉత్పత్తి

జైపూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌లో 600 మెగావాట్ల సామర్థ్యం గల యూనిట్ 1లో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. బాయిలర్ ట్యూబ్ లీకేజీ కారణంగా ఆదివారం నుంచి విద్యుత్ ఉత్పత్తి నిలిపివేశారని కార్మికులు పేర్కొన్నారు. అధికారులు బాయిలర్ ట్యూబ్ లీకేజీ మరమ్మతు పనులను చేపడుతున్నారు.

నీల్వాయి ప్రాజెక్టుకు తొలగిన అడ్డంకులు

- కేంద్ర అటవీశాఖకు నిధులు చెల్లించిన ప్రభుత్వం
- రూ. 50 లక్షలు డిపాజిట్ చేసిన ఇరిగేషన్‌శాఖ
- వర్క్ పర్మిట్ వస్తే పనులకు మార్గం సుగమం


నీల్వాయి ప్రాజెక్టు

మంచిర్యాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తక్కువ వ్యయంతో ఎక్కువ ఆయకట్టు సాగులోకి తేవాలన్న ప్రభుత్వ ఆశయం ఎట్టకేలకు నెరవేరేందుకు మార్గం సుగమమైంది. ఇంతకాలం నిధుల కేటాయింపుల్లో జాప్యం కారణంగా ఆ చర్యలు ముందుకు రాలేదు. వేమనపల్లి మండలంలోని నీల్వాయి ప్రాజెక్టుకు తక్కువ మొత్తంలో నిధులు వెచ్చించడం ద్వారా సుమారు 5 వేల ఎకరాలకు సాగు నీరు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

రూ. 50 లక్షల ఖర్చుతో...

ప్రాజెక్టు నుంచి ఐదు వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు కేవలం రూ.50 లక్షలు ఖర్చు చేస్తే మార్గం సుగమమయ్యే అవకాశాలు ఉన్నాయి. ఆ దిశగా చర్యలు చేపట్టడంలో జాప్యం జరిగింది. దీంతో ఎక్కడి పనులు అక్కడే పెండింగులో ఉన్నాయి. మరోవైపు జూన్‌లోనే పనులు పూర్తిచేయాలని నిర్ణయించినా కార్యాచరణ ప్రారంభించలేదు. జలయజ్ఞం పథకంలో భాగంగా మండలంలోని నీల్వాయి వాగుపై నిర్మించిన ఈ ప్రాజెక్టు సామర్థ్యం 0.846 టీఎంసీలు కాగా 2006లో రూ.216 కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణం చేపట్టారు.

స్టేజ్-2 అనుమతులు లభించినా

వేమనపల్లి మండలంలో 2006లో రూ.90.50 కోట్లతో నీల్వాయి ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభమైంది. కుడి కాలువ ద్వారా 5,600 ఎకరాలకు నీరు అందుతుండగా, ఎడమ కాలువ ద్వారా 7,400 ఎకరాలకు నీరు అందించాల్సి ఉంది. ఈ కాలువ పనులు 75 శాతం మేర పూర్తయిన తరువాత 2016లో రూ.211.32 కోట్లతో ప్రాజెక్టు నమూనా మార్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రాయోజిత పథకం ఏఐబీపీ కింద నిధులు కేటాయించగా జిల్లాలోని వేమనపల్లి, కోటపల్లి మండలాల పరిధిలోని 13వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించేందుకు ప్రణాళికలు రూపొందించారు. అయితే రెండు మండలాల పరిధిలో నీరందించే ప్రాజెక్టు అటవీ ప్రాంతంలో ఉండటంతో నిర్మాణానికి కేంద్ర అటవీశాఖ అనుమతులు నిరాకరించింది. దీంతో పనుల్లో తీవ్ర జాప్యం జరుగగా, అటవీ భూముల్లో పనులు చేపట్టేందుకు అటవీ శాఖకు రూ. 50 లక్షల 29వేల 500లు చెల్లించాలనే డిమాండ్‌తో కేంద్ర అటవీ పర్యావరణ మంత్రిత్వశాఖ గతేడాది డిసెంబరు 14న స్టేజ్-2 అనుమతులు జారీ చేసింది.

రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన మేరకు కార్యాచరణ

సొమ్ము డిపాజిట్ చేసిన ఇరిగేషన్ శాఖ

ప్రారంభించడంలో ఆలస్యం జరిగినప్పటికీ, ఎట్టకేలకు సొమ్ము చెల్లించడంతో మార్గం సుగమమైంది. ఎనిమిది నెలల అనంతరం ఇరిగేషన్ డిపార్టుమెంట్ ఎట్టకేలకు సంబంధిత సొమ్ము రూ.50 లక్షలను సెప్టెంబరు 27న కేంద్ర అటవీశాఖ అకౌంట్‌లో డిపాజిట్ చేసింది. దీంతో ప్రాజెక్టు పనులు చేపట్టేందుకు మార్గం సుగమమైంది. ఐదు వేల ఎకరాలకు సాగునీరు...

మిగతా 7లో ..

'మంచి మంచిర్యాల' అక్షరాలను మాయం చేసిన వారిని శిక్షించాలి

గర్మిళ్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో ఏర్పాటు చేసిన మంచి మంచిర్యాల అక్షరాలను దొంగతనం చేసిన వారిని అరెస్టు చేయాలని మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు డిమాండ్ చేశారు. మంగళవారం ఐబీ చౌరస్తాలో ఆయన మాట్లాడుతూ మంచిర్యాల సుందరీకరణలో భాగంగా ఐబీ చౌరస్తాలో మంచి మంచిర్యాల పెట్టాలని నిర్ణయం తీసుకుని ఏర్పాటు చేశామన్నారు. రాముడు ఈ ప్రాంతానికి వచ్చినట్లుగా పురాణాలు చెబుతున్నాయని, దీంతో పాత మంచిర్యాల రామాలయం, రాముని చెరువు నిర్మాణం జరిగిందన్నారు. అందుకే ఇక్కడే మంచి మంచిర్యాల పాయింట్ పెట్టామన్నారు. మంచి మంచిర్యాల పేరును ఎవరో మాయం చేశారని, వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని ఇందుకు మున్సిపల్ కమిషనర్, కలెక్టర్ బాధ్యత తీసుకుని తక్షణమే విచారణ చేపట్టాలన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మోగనున్న పెళ్ళిబాజాలు

- దసరాతో ముగిసిన మూఢం
- వివాహాది శుభకార్యాలకు లైన్ క్లియర్
- డిసెంబరు వరకు మంచి ముహూర్తాలు
- మొదలైన కొనుగోళ్ళ సందడి



దండేపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మూడునెలల పాటు కొనసాగిన మూఢాలు ముగిసి, శుభకార్యాలకు ముహూర్తాలు మొదలయ్యాయి. మూడు నెలల పాటు పెళ్లిబాజాలు మోగనున్నాయి. దసరాతో మొదలైన శుభ గడియాలు డిసెంబరు 26వరకు ఉన్నాయి. శుభ ముహూర్తాలు మొదలుకావడతో ఫోటో వీడియో గ్రాఫర్స్, డేకరేషన్, కళ్యాణ మండపాలు, కేటరింగ్, డీజేల నిర్వాహకులకు ఆర్డర్లు మొదలయ్యాయి. వస్త్ర, బంగారం దుకాణాల్లో అమ్మకాలు జోరందుకున్నాయి.

శుభ సుముహూర్తాలు ఇవే..

అక్టోబరు: 12, 13, 16, 20, 23, 24, 27, 28
నవంబరు 3, 7, 8, 9, 10, 13, 14, 16, 17, 18, 23, 25
డిసెంబరు 4, 5, 6, 7, 8, 11, 12, 14, 15, 18, 20, 22 25, 26

మొదలైన కొనుగోళ్ళ సందడి

వధూవరులతో పాటు కుటుంబీకులు దుస్తుల కొనుగోలుకు ఆసక్తి చూపుతారు. షాపింగ్ మాల్స్‌తోపాటు ఆయా షాపుల్లో కొనుగోళ్ల సందడి మొదలైంది. దీపావళి పర్వదినం నేపథ్యంలో విక్రయాలు జోరందుకున్నాయి. పెళ్లిళ్ల సీజన్ మొదలుతో ఫంక్షన్ హాళ్లు ముస్తాబవుతున్నాయి.

మంచి రోజులొచ్చాయి..



శుభ ముహూర్తాలు వచ్చేశాయి. అక్టోబరు, నవంబరు, డిసెంబర్ నెలల్లో మంచి రోజులున్నాయి. దీంతో వివాహది శుభకార్యాలకు అడుగులు పడుతున్నాయి. మూడు నెలల పాటు మూఢం ఉండడంతో శుభకార్యాలు జరగలేదు.

- ఇందారపు సంతోష్‌శర్మ పురోహితుడు

భూసేకరణ ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలి


ఆసుపత్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారుల నిర్మాణంలో భాగంగా భూసేకరణ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర రోడ్లు భవనాలు, రవాణా శాఖ కార్యదర్శి దాసరి హరిచందన అన్నారు. మంగళవారం హైద్రాబాద్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, అధికారు లతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మంచిర్యాల- వరంగల్-ఖమ్మం-విజయవాడ జాతీయ రహదారి 163జీ 334 కిలోమీటర్లు ఉంటుందని, ఇందుకు 1383 హెక్టార్ల భూమి సేకరించాల్సి ఉంటుందన్నారు. ఆర్మూర్-జగిత్యాల, మంచిర్యాల జాతీయ రహదారి 63 నిర్మాణం 132 కిలో మీటర్ల మేర ఉంటుందని, 536.9 హెక్టార్ల భూమి సేకరించాల్సి ఉంటుందని తెలిపారు. భూసేకరణ అవార్డు జారీ చేసి భూ బదలాయింపు జరగని రైతులు, యజమానులతో చర్చించి ఆర్బిట్రేషన్‌కు వచ్చేలా చర్యలు తీసు కోవాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ కుమార్ దీపక్ సమావేశం నిర్వహించారు. భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని పేర్కొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

బెల్లంపల్లి, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. బెల్లంపల్లిలోని వంద పడకల ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించారు. ఆసుపత్రిలోని మందుల నిల్వలు, రికార్డులు, రిజిష్టర్‌లను, వార్డులను పరిశీలించారు. మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి కమిషనర్, చైర్‌పర్సన్‌తో అభివృద్ధి పనుల గురించి తెలుసుకున్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ రవి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్,చైర్‌పర్సన్ జక్కుల శ్వేత ఉన్నారు.

రేపు జాబ్‌మేళా

శ్రీరాంపూర్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు మినీ జాబ్‌మేళా ఈ నెల 24న నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం.రజనీ కిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. మంచిర్యాల ప్రభుత్వ ఐటీఐలో శ్రీరాం లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్స్(40 ఖాళీలు) ఉన్నాయని, డిగ్రీ కలిగిన వారు నేరుగా హాజరుకావాలని సూచించారు. 9640731731, 9849900731, 9110368501 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

ఎంపిక పోటీలు

బెల్లంపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 24న మంచిర్యాల బాలుర ఉన్నత పాఠశాలలో క్రికెట్ ఎంపిక పోటీలు, 25న రామకృష్ణపూర్‌లోని తిలక్ స్టేడియంలో ఫుట్‌బాల్ పోటీలు జరుగుతాయని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి అంజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు రిపోర్టు చేయాలన్నారు. 9440141328, 9440010696, 9573615637లో సంప్రదించాలన్నారు.

ట్రైయినీ బీట్ ఆఫీసర్ల పర్యటన

భీమారం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): దూలపల్లి ఫారెస్టు అకాడమీలో శిక్షణ పొందుతున్న ఫారెస్టు బీట్ ఆఫీసర్లు మంగళవారం భీమారంలోని నర్సరీ, ప్లాంటేషన్‌లను పరిశీలించారు. నర్సరీలో ప్రైమరీ బెడ్‌లు తయారీ, మొక్కల పెంపకం, నాటే ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అటవీ అధికారులు అవగాహన కల్పించారు. అటవీ, వన్య ప్రాణుల సంరక్షణ గురించి వివరించారు. ఎఫ్‌డీవో వినయ్‌కుమార్ సాహూ, ఎఫ్ఆర్‌వో రత్నాకర్‌రావు, డీవైఆర్‌వో సుధాకర్, ఎఫ్ఎస్‌వో రామకృష్ణసర్కార్, ఎఫ్‌బీవో బానేష్ పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలను విడుదల చేయాలి

చెన్నూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే ప్రభుత్వం విడుదల చేయాలని తపస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు డిమాండ్‌చేశారు. మంగళవారం పొక్కూరు జిల్లా పరిషత్ పాఠశాలలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఉపాధ్యాయులు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. సాంబయ్య, నాగరాజు పాల్గొన్నారు.

ప్రజలు అభివృద్ధిని హర్షిస్తున్నారనే ఎమ్మెల్యేపై ఆరోపణలు

మంచిర్యాల అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని ప్రజలంతా హర్షిస్తున్నారనే అక్కసుతోనే ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావుపై మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంచిర్యాల, నస్పూర్ మున్సిపల్ చైర్మన్లు రావుల ఉప్పలయ్య, సురిమిల్ల వేణు, వైస్ చైర్మన్ సల్ల మహేష్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిట్ల సత్యనారాయణలు మాట్లాడారు. ఐబీలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కూల్చివేత పనులు జరుగుతున్న నేపథ్యంలో సెల్ఫీ పాయింట్‌లోని 'మంచి మంచిర్యాల' అక్షరాలను తొలగించామని, వాటిని మున్సిపల్ కార్యాలయంలో భద్రపరిచామన్నారు. విషయం తెలియని దివాకర్‌రావు ఐబీలో నిరసన తెలిపారని, ఇలాంటి చిల్లర రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దండేపల్లి, (ఆంధ్రజ్యోతి): అక్రమార్కులను కాపాడుకునేందుకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్, తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకు మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావుపై అసత్య ఆరోపణలు చేయడం అర్ధరహితమని రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి అన్నారు. దండేపల్లిలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేయని అభివృద్ధిని ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు రూ.800 కోట్లతో చేపట్టాడని, దానిని చూసి ఓర్వలేక ఎమ్మెల్యేపై ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. బీజేపీ నాయకుడు హరినాయక్ అక్రమ దందాలకు పాల్పడుతూ అధికారులను, ప్రజలను బెదిరింపులకు గురి చేశాడని, చట్టం తనపని తన చేస్తే జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. లక్షెట్టిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి ప్రేమ్‌చందు, పార్టీ మండల అధ్యక్షుడు అక్కల వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, మాజీ ఎంపిటిసి ముత్యాల శ్రీనివాస్, నాయకులు రాజేందర్, వెంగల్‌రావు, దుర్గప్రసాద్ శంకరయ్య పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

హాజీపూర్, (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తోట రవి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతిలు అన్నారు. మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావుకు ఆదరణను చూసి ఓర్వలేకనే కొందరు అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. మందపల్లి శ్రీనివాస్‌పై అనేక కేసులు ఉన్నాయని వివరించారు. నాయకులు శ్రీనివాసరావు, సత్తయ్య, బాపు, బాలరాజు, సుమలత, శ్రీశైలంగౌడ్, మహేందర్, మధుసూదన్, శ్రీనివాస్, పాల్గొన్నారు.